

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 16-06-2025 | సంపుటి - 24 | సంచిక - 45 రూ : 4 | పేజీలు: 8




## సింగరేణి మట్టిలో
# అరుదైన మూలకాలు

- బొగ్గు గనుల్లో, విద్యుత్ కేంద్రాల బూడిదలో గుర్తింపు
- అత్యంత కీలకమైన 14 రకాల మూలకాల ఉనికి
- వాటితో వ్యాపారానికి సంస్థ ప్రణాళికలు
- డెలాయిట్‌కు అధ్యయన బాధ్యతల అప్పగింత

**జూన్ 15, హైదరాబాద్:** అంతర్జాతీయ మార్కెట్‌లో అత్యంత డిమాండు ఉన్న అనేక రకాల 'అరుదైన భూ మూలకాలు(రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌ఆర్ఈఈ) సింగరేణి మట్టిలో ఉన్నట్లు తేలింది. సింగరేణి బొగ్గు గనుల్లో తవ్విన మట్టిని, విద్యుత్కేంద్రాల నుంచి వెలువడుతున్న బూడిదను ప్రయోగశాలల్లో పరిశీలించి వీటి ఉనికిని గుర్తించినట్లు కేంద్ర బొగ్గు శాఖకు సింగరేణి

తరువాయి 2లో



2లో

## నెలాఖరులోగా
## స్థానిక ఎన్నికల షెడ్యూలు

- నేటి నుంచి రైతుల ఖాతాల్లో 'భరోసా'
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జూన్ 15, కూసుమంచి: ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందని, సోమవారం మంత్రులతో సీఎం నిర్వహించే సమావేశంలో ఎన్నికల తేదీపై స్పష్టత వస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తొలుత మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత గ్రామపంచాయతీలు, పురపాలికలకు

తరువాయి 2లో



## సర్కారు బడుల్లో
# అత్యాధునిక బోధన

- ఉచిత సేవలకు ముందుకొచ్చిన ఆరు స్వచ్ఛంద సంస్థలు
- సీఎం సమక్షంలో విద్యాశాఖ ఒప్పందాలు

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ.. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ(ఎన్‌జీఓ)లతో పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్‌టెక్ సదుపాయాలు కల్పించనుంది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో

తరువాయి 2లో

## మిగ్-21ను
## తస్కరించిన వేళ..!

- ప్రత్యర్థి యుద్ధవిమాన సత్తా తెలుసుకునేందుకు ఇజ్రాయెల్ సాహసం
- 1966 నాటి ఆపరేషన్.. మొస్సాద్ సామర్థ్యానికి గీటురాయి

**జూన్ 15:** రహస్య ఆపరేషన్లలో ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొస్సాద్‌ది అందెవేసిన చేయి! ప్రపంచంలో ఎక్కడైనా.. ఏదైనా చేయగల నేర్పు ఆ సంస్థ సొంతం. తాజా పశ్చిమాసియా ఘర్షణల్లో ఇరాన్‌లోకి వ్యూహాత్మకంగా తన డ్రోన్లను తరలించిన ఇజ్రాయెల్.. అక్కడే ఒక స్థావరాన్ని ఏర్పాటుచేసుకొని కోవర్ట్ ఆపరేషన్‌ను నిర్వహించింది. మొస్సాద్ చరిత్రలో ఇలాంటి రహస్య

తరువాయి 2లో






## నదిలో కూలిన వంతెన..
# అనేక మంది గల్లంతు!

- పుణెలో ఇంద్రాయణి నదిపై వంతెన కూలి ఘోర ప్రమాదం
- ఘటనలో నలుగురు పర్యాటకులు మృతి, పలువురు గల్లంతు
- సురక్షితంగా 39 మందిని కాపాడిన సహాయక బృందాలు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన ప్రభుత్వం
- వంతెనల నాణ్యతపై తనిఖీలకు సీఎం ఆదేశం
- భారీ వర్షా లతో ఉధృతంగా ప్రవహిస్తున్న నది

మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. కుండ్‌మాల పర్యాటక ప్రాంతంలో ఇంద్రాయణి నదిపై నిర్మించిన వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో నలుగురు పర్యాటకులు మృతి చెందగా, పలువురు నదిలో

తరువాయి 2లో

## పొగాకు భారంలో..
# బోర్డు సగం భరించాలి

- మామిడి గుజ్జుపై జీఎస్టీని 12% నుంచి 5% తగ్గించండి
- పామోలిన్ దిగుమతి సుంకం తగ్గింపుపై పునరాలోచించండి
- ఆక్వా ఎగుమతులపై అమెరికా సుంకాల భారం తప్పించండి
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను కోరిన సీఎం చంద్రబాబు

2లో





## ఇజ్రాయెల్- ఇరాన్
## యుద్ధాన్ని ఆపేస్తా.. ట్రంప్ గొప్పలు

వాషింగ్టన్: ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఆ రెండు దేశాలూ ఓ ఒప్పందానికి రావాల్సిన అవసరముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఆ దిశగా తాను ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తన మధ్యవర్తిత్వంలో ఎన్నో దేశాల మధ్య శాంతి నెలకొందని చెప్పిన ఆయన.. ఆ క్రెడిట్ మాత్రం తానెప్పుడూ తీసుకోలేదని అన్నారు.

తరువాయి 2లో

# సింగరేణి మట్టిలో అరుదైన మూలకాలు

(మొదటిపేజీ తరువాయి)
నివేదించింది. మట్టిలో కలిసిపోయి ఉన్న ఆర్ఈఈలను వ్యాపార వస్తువులుగా మార్చే స్థాయిలో వెలికితీయాలంటే ఏం చేయాలో అధ్యయనం చేసి చెప్పాలంటూ ఇటీవల కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్‌కు బాధ్యతలు అప్పగించింది.

**అద్దాల నుంచి అంతరిక్షం వరకు...**

మనిషి రోజువారీ జీవితాన్ని మరింత సులభతరం చేయడానికి జరుగుతున్న ప్రయోగాలు, చేస్తున్న ఆవిష్కరణల్లో అరుదైన మూలకాలు, ఖనిజాల పాత్ర కీలకం. వీటిని సిరామిక్, వైద్య పరికరాలు, గ్లాస్, రంగులు, ఐరన్ పరిశ్రమల్లో, రాకెట్ సైన్స్, అణు రియాక్టర్లలో వాడతారు. ఈ మూలకాలతో వ్యాపారం చేస్తే తమ ఆదాయం పెరగడంతోపాటు దేశ ఖనిజ రంగానికి సైతం మేలు జరుగుతుందని సింగరేణి స్పష్టంచేసింది. మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో 1,200 మెగావాట్ల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యమున్న సింగరేణి థర్మల్ ప్లాంట్ నుంచి ప్రతిరోజూ వేల టన్నుల ఫ్లైయాష్(బూడిద) వెలువడుతోంది. దీన్ని భువనేశ్వర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ(ఐఎంఎంటీ) ప్రయోగశాల్లో పరీక్ష చేయిస్తే ఆర్ఈఈలు ఉన్నట్లు తేలింది. ఖమ్మం జిల్లా కల్లూరు అటవీ ప్రాంతంలోని మట్టిలో, రామగుండం ప్రాంతంలో సింగరేణికి ఉన్న ఉపరితల బొగ్గు గని నుంచి తవ్విన మట్టిలోనూ వీటిని గుర్తించారు. వీటిలో ప్రధానంగా సిరియం, లాంథనం, నియో డిమియం, ప్రెసియో డిమియం, గాడోలినియం, డిస్ప్రోజియం, లుటీషియం వంటి 14 రకాల అరుదైన మూలకాలు ఉన్నట్లు తేలిందని కేంద్రానికి సింగరేణి సంస్థ నివేదించింది. జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థకు చెందిన శాస్త్రవేత్తలతో చేయించిన పరిశోధనల్లోనూ... రామగుండం రెండో ఉపరితల గని మట్టిలో వెనేడియం, స్ట్రాంటియం, జిర్కోనియం ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటి కీలక మూలకాల ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం ఉన్నట్లు కేంద్ర బొగ్గుశాఖకు ఈ సంస్థ వివరించింది. బొగ్గు గనులున్న అన్ని ప్రాంతాల మట్టిలో ఉన్న మూలకాల ఉనికిని కనుగొనడానికి, విశ్లేషించడానికి త్వరలోనే జియో సైన్స్ ల్యాబొరేటరీ ఏర్పాటుకు సింగరేణి చర్యలు ప్రారంభించింది.

**క్వీన్స్‌లాండ్ సంస్థతో చర్చిస్తున్నాం**

కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టాలన్న ఉద్దేశంతో ఇప్పటికే జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ)తోపాటు ఈ రంగంలో అనుభవమున్న ఇతర సంస్థలతోనూ చర్చిస్తున్నాం. ఆస్ట్రేలియా క్వీన్స్‌లాండ్ ప్రభుత్వ సహకారంతో కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలో ఉమ్మడిగా పని చేసేందుకు చర్చిస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో కలిసి జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు సైతం అవకాశాలను పరిశీలిస్తున్నాం. త్వరలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కీలక ఖనిజాల గనుల వేలంలోనూ పాల్గొనడానికి సంసిద్ధంగా ఉన్నాం.

# సర్కారు బడుల్లో అత్యాధునిక బోధన

(మొదటిపేజీ తరువాయి)
విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఆరు ఎన్‌జీఓ ప్రతినిధులతో ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ వంటి పేరొందిన సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్న ఎన్‌జీవోల జాబితాలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన ఈ సంస్థల భాగస్వామ్యంతో.. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ప్రత్యేక కార్యదర్శి హరిత, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పాఠశాల విద్య సంచాలకుడు నర్సింహారెడ్డి, త్వరలో పాఠశాల విద్య సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించనున్న నవీన్ నికోలస్, ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సీవోవో జగదీశ్‌బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కోఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా ఎండీ స్వాతి వాసుదేవన్, పైజామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షోయబ్ దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సీఈఓ గాయత్రి నాయిర్ లోబో తదితరులు పాల్గొన్నారు.

**ఏ సంస్థ.. ఏ సేవలు..**

నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్‌స్టెప్ ఫౌండేషన్.. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్లాట్‌ఫాంతో 540 పాఠశాలల్లో ఇప్పటికే పనిచేస్తోంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో ఐదు వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు తన సేవలు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు గణితంలో ప్రాథమికాంశాలను ఈ సంస్థ బోధిస్తుంది.

* ఫిజిక్స్ వాలా.. ఇంటర్ విద్యార్థులను నీట్, జేఈఈ, క్యాట్ పరీక్షలకు సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు శిక్షణ అందిస్తుంది.
* ఖాన్ అకాడమీ.. రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది.
* ప్రజ్వల ఫౌండేషన్.. 612వ తరగతి వరకూ విద్యార్థులకు బాలసురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది.
* పైజామ్ ఫౌండేషన్.. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్, కంప్యుటేషనల్ థింకింగ్‌పై శిక్షణ ఇస్తుంది.
* ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ..రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేల మందికి పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు.. బాలికల అక్షరాస్యత, విద్యావకాశాలను మెరుగుపరుస్తుంది.

# పొగాకు భారంలో.. బోర్డు సగం భరించాలి

హెచ్‌డీ బర్లీ పొగాకు ధరలు తగ్గిన నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వమే రూ.300 కోట్లతో 20 మిలియన్ కిలోలు కొనాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రం ఖర్చు పెడుతున్న రూ.300 కోట్లలో రూ.150 కోట్లు పొగాకు బోర్డు భరించేలా చూడాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు, పామోలిన్ దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులపై ప్రతీకార సుంకాలు, మామిడి గుజ్జుపై జీఎస్టీ తదితర అంశాలపై వారు చర్చించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఏడు చోట్ల పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చంద్రబాబు వివరించారు. పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్‌ను బోర్డు ద్వారా నియంత్రించేలా చట్ట సవరణ చేయాలని కోరారు. ముడి పామోలిన్‌పై దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించడం వల్ల రాష్ట్ర రైతులు నష్టపోతున్నారని సీఎం పేర్కొన్నారు. ఈ నిర్ణయం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ లక్ష్యానికి కూడా ఇది ఇబ్బందికరమేనని వివరించారు. సుంకం తగ్గింపు నిర్ణయంపై పునరాలోచన చేయాలన్నారు.

**మామిడి గుజ్జుపై జీఎస్టీ తగ్గించాలి**

ఆక్వా ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం తీవ్రంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా 27% సుంకం విధించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగంపై ఆధారపడిన రైతులు సహా 8 లక్షల మందిపై ప్రభావం పడుతుందని వివరించారు. ఈ విషయంలో అమెరికాతో చర్చలు జరపాలన్నారు. మామిడి గుజ్జుపై 12% జీఎస్టీని 5% చేయాలని కోరారు. వివిధ సమస్యలపై కేంద్రమంత్రికి ఆయన వినతిపత్రం అందించారు.

# నదిలో కూలిన వంతెన.. అనేక మంది గల్లంతు!

(మొదటిపేజీ తరువాయి)
కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సహాయక బృందాలు తక్షణమే రంగంలోకి దిగి 39 మందిని సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారికోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ప్రమాద సమయంలో వంతెనపై అధిక సంఖ్యలో పర్యాటకులు ఉన్నట్లు సమాచారం. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని, గాయపడిన వారి చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. వంతెన శిథిలావస్థకు చేరడం, సామర్థ్యానికి మించి జనం ఉండటమే ప్రమాదానికి కారణమని ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. ఇదే ప్రాంతంలో రూ.8 కోట్లతో కొత్త వంతెన



నిర్మాణానికి ఇప్పటికే ఆమోదం లభించిందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని నదీ వంతెనల నిర్మాణ నాణ్యతపై తనిఖీలు (స్ట్రక్చరల్ ఆడిట్) నిర్వహించాలని మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆదేశించారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. సహాయక చర్యల గురించి సీఎం ఫడ్నవీస్‌ను అడిగి తెలుసుకున్నారు.

# ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు మళ్ళీ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)
జరుగుతాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం పరిధిలోని కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం మండలాల కాంగ్రెస్ నాయకులతో మంత్రి ఆదివారం విడివిడిగా సమావేశమయ్యారు. అంతకుముందు కూసుమంచిలోనే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏరువాక' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓ రైతు క్షేత్రంలో స్వయంగా అరక దున్ని, రెండు వరసలుగా అచ్చు తోలారు. మహిళా కూలీలతో కలిసి పత్తి విత్తనాలు విత్తారు. కాంగ్రెస్ నాయకులతో సమావేశంలోనూ, వ్యవసాయ క్షేత్రంలో విలేకరులతోనూ మంత్రి మాట్లాడారు. ''స్థానిక ఎన్నికల్లో అన్నిస్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి. అభ్యర్థులను గ్రామస్థాయి నాయకత్వమే నిర్ణయించుకోవాలి. ప్రజల్లో మంచి పేరున్న వ్యక్తులనే ఎంపిక చేయాలి. నాయకుల మధ్య లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకొని ఎన్నికలకు సమాయత్తం కావాలి. పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఎవరైనా పనిచేసినట్లు నా దృష్టికి వస్తే చర్యలుంటాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన



బాధ్యత నాయకులదే. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలి.

*** త్వరలోనే ధాన్యం బోనస్ సొమ్ములు జమ**

రాష్ట్రంలోని రైతులకు సోమవారం నుంచి వారం రోజులపాటు 'రైతు భరోసా' పెట్టుబడి సాయం అందించనున్నాం. ఒక్క గుంట వ్యవసాయ భూమి ఉన్న రైతు మొదలు పంటలు సాగయ్యే ప్రతి ఎకరానికి రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అవుతుంది. రైతులు వడ్డీ వ్యాపారులను, బ్యాంకులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యాసంగిలో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బోనస్ సొమ్ములనూ కొద్దిరోజుల్లోనే జమ చేస్తాం'' అని పొంగులేటి అన్నారు.

# ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధాన్ని ఆపేస్తా.. ట్రంప్ గొప్పలు



(మొదటిపేజీ తరువాయి)
ఈ మేరకు తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. కేవలం తన వల్లనే నెల రోజుల క్రితం భారత్‌పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని మరోసారి గొప్పలు చెప్పుకొన్నారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలను భారత్ కొట్టిపారేసిన సంగతి తెలిసిందే. ప్రతి వివాదం తన వల్లే పరిష్కారమైందంటూ ప్రగల్భాలు పలికే ట్రంప్.. తాజాగా ఇజ్రాయెల్‌ఇరాన్‌ల ఉద్రిక్తతలు తగ్గితే దాన్ని తన ఖాతాలోనే వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం ఆత్మరక్షణకోసమే ఇజ్రాయెల్‌పై దాడులు చేశామని, ఆ దేశం సైనిక చర్యను నిలిపివేస్తే.. తాము కూడా ప్రతిదాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించిన కొద్ది సేపటికే.. ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. అంతకు కొద్దిసేపటి ముందే ఇరాన్ హెచ్చరిస్తూ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ దాడులతో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని, అయినా లెక్క చేయకుండా అమెరికాపై దాడికి తెగబడితే కనీవినీ ఎరుగని రీతిలో టెహ్రాన్‌పై విరుచుకుపడతామని హెచ్చరించారు. తాజాగా ఆ రెండు దేశాల మధ్య సంధి కుదురుస్తానని మరోసారి గొప్పలు చెప్పుకున్నారు. తాను తొలిసారి అధ్యక్షుడిగా పని చేసిన సమయంలో సెర్బియాకొసోవో, ఈజిప్ట్ ఇథియోపియా మధ్య వివాదాలను పరిష్కరించినట్లు చెప్పుకొచ్చారు. అలాగే ప్రస్తుతం ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కూడా త్వరలోనే శాంతి ఒప్పందం ఏర్పడుతుందన్నారు. దీని కోసం ఇప్పటికే చాలా సమావేశాలు నిర్వహించానని, పలువురితో సంప్రదింపులు జరిపానని రాసుకొచ్చారు.

# మిగ్21ను తస్కరించిన వేళ..!

(మొదటిపేజీ తరువాయి)
కార్యకలాపాలు అనేకం ఉన్నాయి. 1966లో ప్రత్యర్థి దేశం నుంచి ఏకంగా ఒక మిగ్21 యుద్ధవిమానాన్ని తస్కరించడానికి ఆ సంస్థ చేపట్టిన ఆపరేషన్ జేమ్స్‌బాండ్ సినిమాలను తలదన్నేలా ఉంది. ఎంత ప్రయత్నించినా ఈ జెట్‌ల గురించి తెలుసుకోవడం ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొస్సాద్‌కు కష్టమైపోయింది. దీంతో ఆ యుద్ధవిమానాన్ని తస్కరించాలని నిర్ణయించింది. 'ఆపరేషన్ డైమండ్' పేరిట ఒక వ్యూహాన్ని సిద్ధం చేసింది. 1960లలో అరబ్ దేశాలకు ఇజ్రాయెల్‌కు మధ్య పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. అప్పటికి అరబ్ దేశాల అమ్ములపొదిలో కొత్తగా మిగ్21 యుద్ధవిమానం చేరింది. అది ఇజ్రాయెల్‌ను కలవరపాటుకు గురిచేసింది. ఆ పోరాట విమాన సామర్థ్యం గురించి వివరాలు బయటకు రాలేదు. అమెరికాకూ ఏమీ తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో మిగ్21 సామర్థ్యాల గురించి తెలుసుకొని, ఆ మేరకు యుద్ధంలో ప్రతివ్యూహాన్ని సిద్ధం చేయాలని ఇజ్రాయెల్ భావించింది. ఇందుకోసం సాహసోపేత ఆలోచన చేసింది. పనిచేసే స్థితిలో ఉన్న ఒక మిగ్21 యుద్ధవిమానాన్ని ఏదైనా దేశం నుంచి తస్కరించాలని నిర్ణయించింది. కట్టుదిట్టమైన భద్రత ఉండే వైమానిక దళ స్థావరం నుంచి ఒక ఫైటర్ జెట్‌ను చేజిక్కించుకోవడం ఆషామాషీ అంశం కాదు! కానీ ఇజ్రాయెలీ గూఢచర్య విభాగం మొస్సాద్‌కు అసాధ్యమంటూ ఉండదు. అనుకున్నట్లే ఒక మిగ్21ను తస్కరించింది. దాని గుట్టుమట్లను విప్పింది. ఆ మరుసటి సంవత్సరం (1967లో) జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్ ఘన విజయానికి అది దోహదపడింది. 1961లో మిగ్21 యుద్ధవిమానాలను సోవియట్ యూనియన్ పశ్చిమాసియా దేశాలకు అందించింది. 1963 నాటికి ఆ సూపర్‌సోనిక్ జెట్‌లు ఈజిప్ట్, సిరియా, ఇరాక్ వైమానిక దళాలకు వెన్నెముకగా మారాయి. 'గరిష్ఠ గోప్యత, భద్రత' షరతు కింద రష్యా.. వీటిని విక్రయించింది. విమానాల భద్రత, సిబ్బంది శిక్షణ, నిర్వహణ బాధ్యతలను ఆయా దేశాలు తీసుకోవాలని స్పష్టంచేసింది. అప్పటికే మిగ్21 యుద్ధవిమానాల గురించి పశ్చిమ దేశాలూ ఆందోళన చెందుతున్నాయి.

**సోవియట్ కనుసన్నల్లో..**

అరబ్ దేశాల్లోని కొన్ని వైమానిక స్థావరాల్లో రక్షణ బాధ్యతను సోవియట్ యూనియన్ తన చేతిలోకి తీసుకుంది. అక్కడ భద్రతను కట్టుదిట్టం చేసింది. మిగ్21 యుద్ధవిమానాల్లో పూర్తిస్థాయిలో ఇంధనం నింపాలంటే రష్యా సలహాదారుల ఆమోదం ఉండాల్సిందే. అయితే ఈ విదేశీ పెత్తనంపై ఆయా దేశాల వాయుసేన సిబ్బందిలో అసంతృప్తి ఉంది.

**బెడిసికొట్టిన ప్రయత్నాలు..**

తొలుత ఈజిప్ట్ వైమానిక దళంలో ఓ పైలట్‌ను లోబరచుకోవడానికి మొస్సాద్ ప్రయత్నించింది. ఒక మిగ్21 యుద్ధవిమానంతో తమ దేశానికి వచ్చేయాలని, ఇందుకు 10 లక్షల డాలర్లు చెల్లిస్తామని ఆఫర్ చేసింది. ఈజిప్ట్‌లో జన్మించిన అర్మేనియన్ జీన్ థామస్ అనే మధ్యవర్తి ద్వారా ప్రయత్నాలు చేసింది. అయితే ఈజిప్ట్ పైలట్ ఇందుకు నిరాకరించాడు. ఇజ్రాయెల్ ప్రయత్నాల గురించి తమ అధికారులకు తెలియజేశాడు. దీంతో థామస్, మరో ఇద్దరు అనుచరులు పట్టుబడ్డారు. వీరిని 1962 డిసెంబరులో ఉరితీశారు. ఆ తర్వాత ఇరాక్‌వైపు ఇజ్రాయెల్ దృష్టిసారించింది. ఆ దేశానికి చెందిన ఇద్దరు పైలట్లను తమ పంచన చేరేలా ఒప్పించడానికి ప్రయత్నించింది. అవి ఫలించలేదు. దీంతో వారిలో ఒకరిని మొస్సాద్ ఏజెంట్లు కాల్చి చంపేశారని, మరొకరిని రైల్లోనుంచి తోసి చంపేశారన్న ఆరోపణలున్నాయి.

**కలిసొచ్చిన పైలట్ నేపథ్యం**

తుదకు 1964లో ఇజ్రాయెల్‌ను అదృష్టం వరించింది. ఇరాక్ వాయుసేనలోని మునీర్ రెడ్ఫా అనే పైలట్ గురించి మొస్సాద్‌కు ఉప్పందింది. అతడికి తుర్కియే మూలాలున్నాయి. సిరియాక్ క్రైస్తవుడు. తన నేపథ్యం దృష్ట్యా ఇరాక్ వాయుసేనలో తనను చిన్నచూపు చూస్తున్నారన్న భావన రెడ్ఫాలో ఉంది. తనకు పదోన్నతులూ ఇవ్వడంలేదన్న అసంతృప్తి అతడిలో గూడుకట్టుకుపోయింది. దీనికితోడు ఇరాక్‌లో మైనార్టీలైన కుర్దులపై వైమానిక దాడులు చేయడానికి తనను పంపడంపై కూడా అతడు రగిలిపోతున్నాడు. తనపై అనుమానంతో.. తాను గగనవిహారం చేసే సమయంలో తన మిగ్21 యుద్ధవిమానంలో అరకొరగా ఇంధనాన్ని నింపేవారని కూడా అతడు వాపోయేవాడు.

**మహిళా ఏజెంటుతో ఎర..**

రెడ్ఫాను తమవైపునకు లాక్కోవడానికి ఒక మహిళా ఏజెంటును మొస్సాద్ పంపింది. ఆమె.. ఆ పైలట్‌తో సంబంధాలు ఏర్పర్చుకుంది. 1966 జులైలో.. ఐరోపాకు వెళ్దామని రెడ్ఫాను ఒప్పించింది. అక్కడికి వెళ్లాక ఇజ్రాయెల్‌కు పయనమవుదామని ప్రతిపాదించింది. ''అక్కడ నాకు మిత్రులున్నారు. వారు నీకు సాయపడతారు'' అంటూ అతడిని నమ్మించింది. అతడి కోసం ఒక కొత్త పాస్‌పోర్టు, టికెట్లను సిద్ధం చేయించింది. ఇజ్రాయెల్‌లో వైమానిక దళ కమాండర్ మేజర్ జనరల్ మోర్దెచాయ్ మోటీ హాడ్ వద్దకు రెడ్ఫాను తీసుకెళ్లారు. అక్కడ 'ఫిరాయింపు' వ్యూహాన్ని అతడి ముందుపెట్టారు. మిగ్21 యుద్ధవిమానంతో తమ వద్దకు వస్తే 10 లక్షల డాలర్ల నజరానా, ఇజ్రాయెల్ పౌరసత్వం, శాశ్వత ఉద్యోగం ఇస్తామని ప్రతిపాదించారు.

# అమ్మవారి బోనాల నిర్వహణకు నిధులు మంజూరు

*** పీఏసీ చైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వాడవాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవలనే ఉద్దేశ్యం తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, ఈ చక్కటి సదవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయి నగర్ లో గల శ్రీ శ్రీ శ్రీ ఎర్రపోచమ్మ ఆలయం ప్రాంగణం నుండి చిత్తారమ్మ ఆలయం వరకు గౌరి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నూకాంబిక అమ్మవారి జాతర సారె , ఘటాల ఊరేగింపు మహోత్సవం కార్యక్రమంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ లు ముఖ్యఅతిథులుగా హజరయ్యారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శ్రీ గౌరి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నూకాంబిక అమ్మవారి జాతర సారె , ఘటాల ఊరేగింపు మహోత్సవం ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం చాలా సంతోషకరమన్నారు. శ్రీ శ్రీ శ్రీ ఎర్రపోచమ్మ ఆలయం ప్రాంగణం నుండి చిత్తారమ్మ ఆలయం వరకు ఊరేగింపు గా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా కన్నుల పండుగ



వాతావరణం లో అంగరంగ వైభవంగా బోనాలు జరుపుకోవాలన్నారు. బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకునేల అన్ని ఏర్పాట్లు , మౌళిక వసతులు ప్రభుత్వం కలిపిస్తుందని తెలియచేసారు.

*** నిధులు మంజూరు కొరకు దరఖాస్తు కు కావలసిన పత్రాలు**

దేవాలయం పేరు మీద ఉన్న లెటర్ హెడ్ , .దేవాలయం ఫోటోలు (అమ్మవారి ఫోటోలు) , దేవాలయం స్టాంప్ , దేవాలయం పాన్ కార్డ్ , దేవాలయం పేరు మీద ఉన్న బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, దేవాలయం రిజిస్ట్రేషన్ పత్రం జిరాక్స్ , దేవాలయం చైర్మన్ లేదా కార్యదర్శి ఆధార్ కార్డ్ జిరాక్స్ , పత్రాలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఉచిత మెగా ఆరోగ్య శిబిరం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ పార్కులో శ్రీ వాసవి సేవక్ సంఘం ఆధ్వర్యంలో రమేష్ క్లినిక్ నిర్వహించిన ఉచిత మెగా ఆరోగ్య శిబిరం అత్యంత విజయవంతంగా జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో ప్రతి రోగికి సుమారు రూ.10,000 విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ రమేష్ ఎంతో నిబద్ధతతో నిర్వహించగా, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. , ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆకాంక్షించారు. శ్రీ వాసవి సేవక్ బృందం చేస్తున్న సేవా కార్యక్రమాలను వారు ప్రశంసించారు. వాసవి సేవక్ ప్రెసిడెంట్ అల్లాడి మహేష్ టీంను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిసలిస్ హైట్స్" ప్రైమరీ స్కూల్ ప్రారంభం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) :జీడిమెట్ల డివిజన్ ఎం. ఎన్. రెడ్డి నగర్ లో గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "క్రిసలిస్ హైట్స్" ప్రైమరీ స్కూల్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద కలలకు ప్రారంభం బుడి బుడి అడుగులతోనే ప్రారంభమనే ఆలోచనతో ఆరంభమైన ఈ క్రిసలిస్ హైట్స్ పాఠశాల ఇప్పటికే బెంగళూరు వ్యాప్తంగా మంచి పేరు గడిచిందన్నారు. ఇప్పుడు హైదరాబాద్ లో మన సుచిత్ర ప్రాంతంలో నూతన శాఖను ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు డిజిటల్ క్లాస్ లతో కూడిన విద్యను అభ్యసిస్తూ మంచి పేరును గండించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ శివ కుమారి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పద్మ, సత్య రెడ్డి, దివ్యా భారతీ, సుష్మా, రాను మిశ్రా, రుక్మిణి, రామలక్ష్మి, రాధ, మాధవి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, బాల మల్లేష్,విజయ్ హరీష్, శ్రీకాంత్, మహిళా నాయకురాలు ఇందిరా రెడ్డి, శ్రీదేవి రెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు.



వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం న్యూ జెర్సీలోని గురువాయూరప్ప ఆలయంలో శ్రీకృష్ణుని వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

: శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి)

## వృత్తి దారులకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలి

*** జూన్ 17న ఛలో ఇందిరాపార్క్ ధర్నాని జయప్రదం చేయండి**



ప్రజాస్ఫూర్తి, బోడుప్పల్: గత ప్రభుత్వం రాష్ట్రంలోని రజకులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తే నేడు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఉన్ సర్కారు గత పదిహేను నెలలుగా బకాయిలు చెల్లించడం లేదని అందుకే ఈ నెల 17 న నగరంలోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నామి రజక వృత్తి దారుల సంఘం నాయకులు తెలిపారు.ఈ మేరకు ఆదివారం నాడు మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల లో ధర్నాకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రజక వృత్తి దారుల సంఘం మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంబే చక్రపాణి మాట్లాడుతూ కులవృత్తులను అర్థికంగా అందుకునేందుకు గాను గత ప్రభుత్వం రజక వృత్తి దారులకు ఉచిత విద్యుత్ అందించారని అన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత పదిహేను నెలల నుండి విద్యుత్ చార్జీలు చెల్లించడం లేదని దాంతో విద్యుత్ అధికారులు వృత్తి దారులపై వత్తిడి తెస్తున్నారని కొన్ని చోట్ల బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు.రజకుల సమస్యలపై ఈ నెల 17 న ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అ ధర్నాకు రజకులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల అధ్యక్షుడు అంబే శ్రీనివాస్,చెంగిచెర్ల కార్యదర్శి, అంబే కృష్ణ,ఎ నరసింహ, యాదయ్య, మల్లేష్, చందర్, రమేష్, నవీన్ కుమార్, కోశాధికారి మహేష్,రాజు, రమేష్, లక్ష్మి ,పద్మ, స్నేహ, నాగరాణి ,గోకుల్ ,కవిత ,నాగమణి,పల్లవి, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.




## పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ఆపరేషన్ కాగార్ ను ఆపాల్సిందే

*** అఖిలపక్ష నాయకులు**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ఆపరేషన్ కాగార్ ను ఆపాల్సిందే నని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా తేదీ 17జూన్ న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చెయ్యాలని ఆదివారం షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకులు గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, సిపిఐ ఎమ్ ఎల్ నాయకులు అనురాధ,శివబాబు, మాస్ లైన్ కార్యదర్శి ప్రవీణ్,సిపిఎం నాయకులు అంజయ్య,సత్యం, స్వాతిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మావోయిస్టు లను ఏరివేత పేరుతో చంపుతాం అని బహిరంగాగా ప్రకటించడం రాజ్యాంగం కల్పించిన మనిషి జీవించే హక్కును కాలరాయడమే నని అన్నారు. చర్చలు జరుపడానికి సిద్ధం అని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇతర దేశాలతో చర్చలు జరుపడానికి సిద్ధమైన ప్రభుత్వం,స్వంత పౌరులతో చర్చలు జరపకపోవడం బీజేపీ దుర్నితిని తెలియచేస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను అంతం అనే పేరుతో ఖనిజాలను అడవులను కార్పొరేట్ సంస్థలకు ధరదత్తం చెయ్యడేమనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడానికి ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలాని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి,వంశీ, జంబూ,లక్ష్మి,సిపిఎం నాయకులు శ్రీను,కరుణాకర్,ఎమ్ డి బాషా తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల్లో సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి

*** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: (లక్ష్మీదేవిపల్లి) నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ విద్య సంస్థ, వసతి గృహాలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులు, వైద్యసిబ్బంది ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధిలో శ్రీ రామ చంద్ర డిగ్రీ కళాశాలలో రూ.35లక్షల పంచాయతి రాజ్ నిధులతో చేపట్టనున్న భవనాల మరమ్మతు పనులకు ఆదివారం కూనంనేని శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత పాలకులు ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేశాయని, ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, ఈ పరిస్థితులను అధిగమించి విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రతి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, ప్రభుత్వ విద్యసంస్థల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, విద్యుత్, త్రాగు నీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి జరుగుతోందని, ఇప్పటికే వివిధ పథకాల్లో మంజూరైన నిధులను పెద్దమొత్తంలో విద్యాసంస్థలకు కేటాయిస్తున్నామని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంపిడివో అంకుబాబు, ప్రిన్సిపల్ డాక్టర్ సి పద్మ, ప్రొఫెసర్ పూర్ణచందర్ రావు, విద్యుత్ శాఖా ఏఈ రఘు రామయ్య, స్థానిక నాయకులు పెదబాబు, కూచిపూడి జగన్, పూనెం శ్రీను, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీను, గౌస్ పాషా, కృష్ణ, మిర్యాల రాము, లగడపాటి రమేష్, రామారావు, దేవరగట్ల రాంబాబు, హరి, మండే హన్మంతరావు, మంద వెంకటేశ్వర్లు, చారి, అఫ్సర్, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కమలాకర్ కు బిగ్గెస్ట్ డాక్టర్స్ అవార్డు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న రాందేవ్ రావు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ రావు కు బిగ్గెస్ట్ డాక్టర్ అవార్డు 25 లభించింది. హైటెక్స్ లో జరిగిన ఈ వేడుకలలో డాక్టర్ కమలాకర్ రావు సారాధ్యంలో రాందేవ్ రావు హాస్పిటల్ లో సేవలందిస్తున్న ఐదు విభాగాల డాక్టర్లు గైనకాలజీ విభాగంలో సేవలందిస్తున్న ప్రొఫెసర్ కే ఛాయాదేవి (గైనకాలజిస్ట్), డాక్టర్ రవికుమార్ సుంకర, డాక్టర్ రాజేష్ సుంకర, డాక్టర్ సూర్య కళ, డాక్టర్ శ్వేత రెడ్డి (ఈఆర్ ఫిజిషియన్ ) లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాందేవ్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ యోబు మాట్లాడుతూ డాక్టర్ కమలాకర్ రావు 52 సంవత్సరాలుగా వైద్య సేవలు అందించడంతో పాటు గతంలో రక్షణ రంగంలో పనిచేశారన్నారు. రాందేవ్ ఆసుపత్రి యాజమాన్యం తరపున మీరా రావు, అపర్ణ రావు, ప్రశాంత్ రెడ్డి, ధనరావు డాక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. డాక్టర్ కమలాకర్ కు బిగ్గెస్ట్ డాక్టర్స్ అవార్డు కు ఎంపిక కావడం పట్ల రామ్ దేవ్ రావు ఆసుపత్రి సీఈవో డాక్టర్ యోబుతో పాటు ఇతర డాక్టర్ల బృందం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## ఏక్ పేడ్ పితా కే నామ్"

*** నాన్న పేరుతో మొక్కలని నాటాలి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టినటువంటి "ఏక్ పేడ్ మా కే నామ్" స్ఫూర్తిగా భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కొత్తగూడెం చెందిన కె ఎన్ రాజశేఖర్ ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటర్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకులు పర్యావరణ పరిరక్షణకు అందరిలో చైతన్యాన్ని నింపుతూ మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ ప్రకృతి దీక్షను తీసుకున్న ప్రతి ఒక్కరికి మొక్కలు నాటే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు.. అదేవిధంగా ఫాదర్స్ డే సందర్భంగా మొక్కల రాజశేఖర్ వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న నైనిక రజువా ప్రకృతి హరిత దీక్షపరాలైన ఆమె జూన్ 15వ తేదీ ఫాదర్స్ డే ని పురస్కరించుకొని "ఏక్ పేడ్ ఫాదర్ కే నామ్"కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు.ఆదివారం ఫాదర్ డే సందర్భంగా నైనిక రజువా తన ఫాదర్ తో కలిసి రామవరం లోని గోధుమ వాగు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఓ మొక్కను నాటారు..నాన్న (పితా) పేరుతో మొక్క, వివిధ రకాల గింజలు నాటి ప్రకృతిని కాపాడుకోవాలని, ప్రపంచాన్ని పచ్చదనంతో నింపాలని ప్రజలందరినీ కోరుతున్న ప్రకృతి హరిత దీక్షపరురాలు నైనిక రజువా ప్రజలందరినీ కోరుతున్నారు.

## మాజీ ఎంపీపీ కిడ్నాప్.. టోల్‌గేట్ వద్ద తప్పించుకుని..

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం 44వ జాతీయ రహదారి టోల్‌గేట్ వద్ద ఆదివారం ఉదయం కిడ్నాప్ కలకలం చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా మామడకు చెందిన మాజీ ఎంపీపీ, భారాస నేత హరీశ్‌ను కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. అతడి ఇన్నోవా వాహనంలోనే అపహరించి హైదరాబాద్ వైపు తీసుకెళ్లారు. ఈక్రమంలో మెదక్ జిల్లా తూప్రాన్ టోల్‌గేట్ వద్ద వాహనం వేగం తగ్గడంతో కిడ్నాపర్ల నుంచి హరీశ్ తప్పించుకుని తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆయన్ను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హరీశ్ చాకచక్యంగా తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు చేరడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై నిర్మల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

# క్రీడలు క్రీడాకారుల్లో పోటీ తత్వం, మరింత నైపుణ్యాన్ని పెంపొందిస్తాయి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నేటి ఆధునిక యాంత్రిక జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. ఆదివారం సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్ నాయక్ నగర్ ఇండోర్ స్టేడియం నందు గత రెండు రోజులుగా "ఏస్ స్పోర్ట్స్ క్లబ్" ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు క్రీడాకారుల్లో పోటీ తత్వం, మరింత నైపుణ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం ప్లాటినం విభాగం, గోల్డ్ విభాగాలలో విజేతలుగా నిలిచిన చంద్రబాబు, దిలీప్, చంద్ర గోపి, ఎస్విఎల్ ప్రసాద్, స్వామి, రామంత్, అశోక్, జీవన్ లతో పాటు రన్నరప్ గా నిలిచిన శ్యామ్, భరత్, భరత్, జితేంద్ర, ప్రసాద్, అశోక్, కన్న, జ్యోతిర్మయి లతో పాటు తృతీయ, నాల్గవ స్థానం సాధించిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి.హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఏవి శేషా చారి, భాస్కర్ రెడ్డి, అనిల్, ఎస్.ఆర్. నాయక్ నగర్, అపురూప కాలనీ, మోడీ బిల్డర్స్, జనప్రియ అపార్ట్మెంట్ లకు కార్యవర్గ సభ్యులు రమణ, రామకృష్ణ, సత్యనారాయణ, గణేష్, పూర్ణచందర్ గుప్తా, మహేష్, దుర్గా ప్రసాద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ఈటెల రాజేందర్కు కృతజ్ఞతలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : యాదవ కమ్యూనిటీ హాల్ కోసం రూ.15 లక్షల నిధులు కేటాయించినందుకు ఆదివారం బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున యాదవ సంఘం సభ్యులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ యొక్క కమ్యూనిటీ హాల్ కు మరొక రూ.30 లక్షలు కేటాయించాలని ఎంపి ని కోరారు. దీంతో ఎంపీ ఈటెల సానుకూలంగా స్పందించారు. బాలయ్య నగర్ లో బీరప్ప గుడి కోసం, చింతల్ చెరుకుపల్లి కాలనీ సంఘానికి శ్రీకృష్ణ మందిరం గురించి స్థలాన్ని ఇప్పించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో జానకిరామ్ , శాంతి కుమార్ యాదవ్ , సమ్మయ్య యాదవ్ , కుమార్ యాదవ్ , గండి రాజు యాదవ్ , సింహ యాదవ్, తిరుపతి యాదవ్, ఆంజనేయులు యాదవ్, పర్వతల్ యాదవ్, శ్రీహరి యాదవ్ , బాలు యాదవ్, శ్రీకాంత్ యాదవ్ , యాదగిరి యాదవ్ , తుకారం యాదవ్ , గోపాలకృష్ణ , రాజు యాదవ్, దేవేందర్ నగర్ కుమార్, శ్రీనివాస్, రమేష్, ముద్దు నగర్ నరసింహ , శ్రీధర్, నాగరాజు యాదవ్, లెనిన్ నగర్ దస్తగిరి యాదవ్ , శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ అవార్డు గ్రహీతకు సన్మానం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:డాక్టరేట్ అవార్డు గ్రహీత యెల్ల రాంరెడ్డికి బాల్యమిత్రులు ఘనంగా సన్మానించారు. రాంరెడ్డి చేసిన సామాజిక సేవలను గుర్తించి తమిళనాడులోని హోసూరు యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యెల్ల రాంరెడ్డికి శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ కస్తూరి శ్రీనివాసరెడ్డి, బీసీ స్టడీ డైరెక్టర్ జెల్లా వెంకటస్వామి, ఆరేపల్లి రఘుపతి, దమ్మ రవీందర్ రెడ్డి, కట్ట బాపు రావు, ఏనుగు వేణు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కలకొండ కిషన్ రావు, కృష్ణ, కోంపల్లి శ్రీనివాస్, సత్యం తదితరులున్నారు.

## గోదావరి నదిలో మునిగి ముగ్గురు యువకులు మృతి

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : గోదావరి నదిలో స్నానానికి వెళ్ళిన కుత్బుల్లాపూర్ చింతల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారు. దీంతో చింతల్ లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల ప్రకారం.....రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన రాజేష్ (20), మదన్ (18), భరత్ (16)లు కొంత కాలం క్రితం బతుకు దెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి చింతల్ డివిజన్ చంద్రానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరు భాసర వద్ద గోదావరి నదిలో స్నానానికి వెళ్ళారు. వీరికి ఈత రాకపోవడంతో వీళ్ళు వెళ్ళిన చోట నీళ్లు లోతుగా ఉండటం వల్లే అందులో మునిగిపోయి మృతి చెందినట్లు జీడిమెట్ల పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించడంతో ఆ ప్రాంతమంతా విషాదచాయలు అలుముకున్నాయి.

## 'దేశంలోనే నెంబర్ వన్ సీఎం'.. తేల్చి చెప్పిన టాలీవుడ్ హీరో

ప్రముఖ సినీ నటుడు సుమన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు తన అనుభవం, దార్శనికతతో రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నారని సీనియర్ హీరో సుమన్ పేర్కొన్నారు. ఇవాళ (ఆదివారం) సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. "సీఎం చంద్ర బాబు ఒక విజనరీ. ఎలాంటి సంక్షోభం వచ్చినా పరిష్కరించగలిగే సమర్థుడు చంద్రబాబు అంటూ.. దేశం లోనే నెంబర్ వన్ సీఎం చంద్రబాబే'' అని ఆయన తేల్చి చెప్పారు.

## సమాజానికి నిస్వార్థంగా సేవలు అందించడంలో రాందేవ్ ఆస్పత్రి ముందుంటుంది

*** రాందేవ్ రావు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు**





కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సమాజానికి నిస్వార్థంగా సేవలు అందించడంలో రాందేవ్ ఆస్పత్రి ముందుంటుందని రాందేవ్ రావు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు అన్నారు. ఆదివారం ఆదన ఆదరణ ఫౌండేషన్ (స్వచ్ఛంద సంస్థ) సహకారంతో రాందేవ్ ఆసుపత్రిలో ఒకటి నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని రాందేవ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ లక్ష్మీ కమలాకర్ లు అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలకు జనరల్ స్క్రీనింగ్, ఐ చెకప్, ఇతర వ్యాధులను గుర్తించడానికి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యోబు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే పిల్లలకు ఎలాంటి రోగాలు రాకుండా ఉండడానికి వైద్య శిబిరంలో పలు పరీక్షలు నిర్వహించి పిల్లలకు రోగాల పట్ల అప్రమత్తత ఉండడానికి డాక్టర్లచే పలు సూచనలు చేయించడం జరిగిందన్నారు. పిల్లల వైద్య శిబిరానికి ఆదరణ ఫౌండేషన్ సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదరణ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అరగెల రఘునాథ్ బాబు మాట్లాడుతూ రాందేవ్ ఆస్పత్రి వైద్యరంగంలో అందిస్తున్న సేవలు అద్భుతం అని కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో రాందేవ్ హాస్పటల్ డాక్టర్ సునీత, డాక్టర్ శృతి, డాక్టర్ మణి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సుమిత్ర, కల్పన మంతెన, లీలా సృజన లు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ కోశాధికారి భాను వర కుమార్, ప్రధాన కార్యదర్శి పి మేరీ జోన్స్, ఎ. అనిషా, ఎ. సన్నీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ లో మొత్తం 5278 కేసుల పరిష్కారం

*** ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా 14వ శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన అండర్ ఇన్వెస్టిగేషన్ , కోర్టు విచారణలో ఉన్న కేసులు (803),డ్రంక్ అండ్ డ్రైవ్ యాక్ట్ కేసులు,ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు (4009),ఈపెట్టి కేసులు,బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన తదితర కేసులు (466) మొత్తం 5278 కేసులు పరిష్కృతం కాబడినయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు,కోర్టు సిబ్బంది గత వారం రోజుల నుండి కేసులలో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి రాజీ మార్గం రాజ మార్గమని,లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించినందున ఈ కేసులు పరిష్కరించబడినాయని తెలిపారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులను,సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. లోక్ అదాలత్ ద్వారా ఇట్టి కేసుల పరిష్కారానికి ప్రతిభ చూపిన అధికారులు , కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు తగిన రివార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు.ఇందులో భాగంగానే జిల్లాలో నమోదైన 226 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి, ఇట్టి కేసులలో నగదును కోల్పోయిన బాధితులకు రూ.60,11,992ల నగదును కోర్టు ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటా

*** బీఆర్ఎస్ పార్టీ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని బీఆర్ఎస్ పార్టీ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డి నగర్ కాశీ విశ్వేశ్వర ఆలయ కమ్యూనిటీ హాల్ నందు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయంతో మూడవసారి ఎమ్మెల్యేగా గెలిచిన కెపి.వివేకానంద్ ని సన్మానిస్తూ "సన్మాన సభ" ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ని కార్యక్రమ నిర్వాహకులు గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ గత రెండు పర్యాయాలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమాన్ని చూసి నిండు మనసుతో తనన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలనీలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం పునః నిర్మాణ పనులకు ముందుకు వచ్చి తమ తోడ్పాటునందిస్తున్న దాతలను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరింపచేశారు.ఈ కార్యక్రమంలో ఎం. ఎన్. రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు టెంపుల్ కమిటీ చైర్మన్ ఎస్. గోవర్ధన్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి భరత్, దేవాలయ ప్రధాన కార్యదర్శి శివరాం రెడ్డి, కోశాధికారి రాము, కాలనీవాసులు లక్ష్మీ మోహన్, మోహన్ రావు, సంజీవరావు, చంద్రారెడ్డి, హరికృష్ణ, కిరణ్ కుమార్, బాల శ్రీనివాసమూర్తి, చంద్రశేఖర్, నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు, కాలే నాగేష్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, సంపత్ గౌడ్, బాల మల్లేష్, ఆటో బలరాం, విజయ్ హరీష్, మహిళా నాయకురాలు ఇంద్రా రెడ్డి, శ్రీదేవి రెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్సు షెల్టర్లు ప్రారంభం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: (లక్ష్మీవిపల్లి)వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం భద్రాద్రి యాడ్స్ సంస్థ స్వచ్ఛందంగా బస్సు సెల్టర్లను నిర్మించి ప్రజలకు అంకితం చేయడం అభినందనీయమని, ఈ సంస్థను ఆదర్శనంగా తీసుకొని ఇతర సంస్థలు, ఆర్థిక స్తోమత ఉన్న ప్రతి ఒక్కరు తమ సేవాకార్యక్రమాలు విస్తృతంగా కొనసాగించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ క్రాస్ రోడ్డు, ఇల్లందు, పాల్వంచ క్రాస్ రోడ్డులో భద్రాద్రి యాడ్స్ సంస్థ నిర్మించిన మూడు బస్సు షెల్టార్లను ఆదివారం కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బస్సులకు వెచ్చివెండి ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి వారికి నీడ కల్పించాలనే సదుద్దేశంతో బస్సు షెల్టార్లను నిర్మించారని, వీటి నిర్వహణ భాధ్యత గ్రామపంచాయతీలకు, అధికారులకుంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని 13 ప్రధాన సెంటర్లలో బస్సు షెల్టర్ల నిర్మాణంకోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంపిడివో అంకుబాబు, ప్రొఫెసర్ పూర్ణచందర్ రావు, విద్యుత్ శాఖా ఏఈ రఘురామయ్య, స్థానిక నాయకులు పెదబాబు, కూచిపూడి జగన్, పూనెం శ్రీను, గౌస్ పాషా, కృష్ణ, మిర్యాల రాము, లగడపాటి రమేష్, రామారావు, దేవరగట్ల రాంబాబు, హరి, మండే హన్మంతరావు, భద్రాద్రి యాడ్స్ సంస్థ వ్యవస్థాపకులు డేవిడ్ రాజు, నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వీరజవాన్ కుటుంబానికి పవన్ ఆర్థిక సాయం రూ.25 లక్షలు అందజేత

*** వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి వ్యక్తిగత ఆర్థిక సాయం చెక్కు పంపిన పవన్ కల్యాణ్**

*** మురళీనాయక్ తల్లిదండ్రులకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యేలు అరణి శ్రీనివాసులు, జయకృష్ణ**

*** కల్యాణ్ మంచి మనసుకు ఇది నిదర్శనమన్న నేతలు**



ఆపరేషన్ సింధూర్లో ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యక్తిగత ఆర్థిక సహాయం ప్రకటించిన విషయం విదితమే. ఆ ప్రకటన మేరకు పవన్ కల్యాణ్ తన సొంత నిధుల నుంచి రూ.25 లక్షలు అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాలో నివసిస్తున్న జవాన్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతి దంపతులకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ నిన్న చెక్కును అందజేశారు. మురళీనాయక్ కుటుంబానికి తన సొంత నిధులు ఇవ్వడం పవన్ కల్యాణ్ మంచి మనసుకు నిదర్శనమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ప్రభుత్వ హామీ మేరకు అధికారులు ఇప్పటికే రూ.50 లక్షలు, ఇంటి స్థలం, వ్యవసాయ భూమిని మురళీ నాయక్ కుటుంబానికి అందజేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో అత్యాధునిక సాంకేతిక బోధన.. ఎన్జీవోలతో విద్యాశాఖ ఒప్పందం



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రముఖ ఎన్‌జీవో సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంవోయూలు కుదుర్చు కుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధనా సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ఎంవోయూ కుదుర్చుకున్నట్టు విద్యాశాఖ తెలిపింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్ టెక్ సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుంది. ఇందుకు నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్ స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృ త్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలో ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తోన్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోనే ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకొంది. రాష్ట్రంలో విద్యా నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు వివిధ సంస్థలు ముందుకొస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలో ఏక్ స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేధ ఆధారిత ప్లాట్‌ఫామ్‌తో 540 పాఠశాలల్లో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది.

## కిషన్‌రెడ్డికి ప్రధాని నరేంద్ర మోదీ బర్త్‌డే విషెస్

దిల్లీ: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి కింది స్థాయి నుంచి ఎదిగిన నాయకుడని కొనియాడారు. బొగ్గు, గనుల రంగాన్ని ఆయన బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ స్వయం సమృద్ధికి ఇది ఎంతో ముఖ్యమని వివరించారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



## బనకచర్ల .. రాజకీయాలకు తావులేకుండా కృషి చేస్తే తోడుగా ఉంటాం: హరీశ్‌రావు



హైదరాబాద్: గోదావరిబనకచర్లపై అపెక్స్ కౌన్సిల్ సమావేశమయ్యేలా చూడాలని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు కోరారు. వీలైనంత త్వరలో అఖిలపక్ష సమావేశం, శాసనసభ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. సాగునీటికి సంబంధించిన అంశాలపై ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ రాశారు. "రాష్ట్ర తాగునీటి అంశాలపై అందరి అభిప్రాయాలతో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకువాలి. గోదావరిబనకచర్లతో తెలంగాణ వాటాకు గండిపడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఇంకా అనుమతి ఇవ్వలేదు. బనకచర్లకు కేంద్రం అనుమతిస్తే రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయి. రాష్ట్ర ప్రాజెక్టులకు కేటాయించిన 969 టీఎంసీలపై హక్కులు ఇంకా సాధించుకోలేదు. ఏపీ చేపట్టే ఏ కొత్త ప్రాజెక్టుకైనా అనుమతిస్తే అది ఆత్మహత్య సదృశ్యమే అవుతుంది. బనకచర్లతో ఏపీ 200 టీఎంసీలను తరలించాలని చూస్తోంది. కృష్ణాలో 112.5 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని కేంద్రాన్ని కోరాలి. ఈ వాటాకు ఏపీ అంగీకరిస్తే బనకచర్లను పరిశీలించవచ్చని ఇంజినీర్లు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. రాజకీయాలకు తావులేకుండా కృషి చేస్తే ప్రభుత్వానికి భారాస తోడుగా ఉంటుంది"అని హరీశ్‌రావు తెలిపారు.



## బాసరలో విషాదం.. ఐదుగురు హైదరాబాద్ యువకుల మృతి

ముథోల్: నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి చెందారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వారిని హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు చెందిన రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం 18 మంది కుటుంబ సభ్యులు బాసరకు వచ్చారు. అమ్మవారి దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేయడానికి బోటుపై నది మధ్యలోకి వెళ్లారు. ఈక్రమంలో అయిదుగురు నీటమునిగి మృతి చెందారు. స్థానికులు, గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటికి తీశారు. సీఐ మల్లేశ్, ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారాంతం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. వేకువజాము నుంచే దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. ప్రసాదం కౌంటర్ల వద్ద భారీ క్యూలైన్లు కనిపించాయి.







## బీసీలకు రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?: శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్: స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని ప్రకటించడం బీసీలకు చేస్తున్న అన్యాయమని భారాస నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బీసీ రిజ ర్వేషన్ బిల్లుపై ప్రధానితో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై బీసీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దగా చేస్తోందని దుయ్యబట్టారు. బిల్లును కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ప్రజలను మళ్లీ మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అక్కరకు రాని పదవులే బీసీలకు ఇస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు.

## సీఎం రేవంత్‌రెడ్డితో కేంద్రమంత్రి జయంత్ చౌదరి భేటీ



హైదరాబాద్: రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరి హామీ ఇచ్చారు. కౌశల్ మందన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రి .. సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి అభినందించారు.

## నీట్‌లో మంచి ర్యాంకు రాలేదని యువతి ఆత్మహత్య



వెల్దండ: నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం నారాయణపూర్ తండాలో విషాదం చోటు చేసుకుంది. నీట్‌లో మంచి ర్యాంకు రాలేదని యువతి ఉరే సుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తండాకు చెందిన ఇస్లావత్ శ్రావణి (19) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు రాకపోవడంతో మనస్తాపానికి గురైంది. కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లిన సమయంలో బలన్మరణానికి పాల్పడింది. శ్రావణికి రెండో ప్రయత్నంలోనూ నీట్‌లో మంచి ర్యాంకు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకుందని స్థానికులు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలకు హెచ్చరిక.. రాబోయే 14 గంటల్లో అతి భారీ వర్షాలు



నైరుతీ రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల వైపు చురుకుగా కదులుతోన్న వేళ భారత వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రాబోయే 14 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లుగా హెచ్చరించింది. ఈ మేరకు తెలంగాణ లోని వికారాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేటతో పాటు జంట నగరాల్లో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆయా జిల్లాల్లో ముందస్తు జాగ్రత్తగా ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అదేవిధంగా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం, పల్నాడు, ఎన్టీఆర్, బాపట్ల, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు కోస్తాంధ్రా వ్యాప్తంగా భారీ వర్షాలు పడే చాన్స్ ఉందని ఐఎండీ తెలిపింది. ఉరుములు, పిడుగలతో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# చార్‌ధామ్ యాత్ర.. ఆర్యన్ ఏవియేషన్ కార్యకలాపాలపై తాత్కాలిక నిషేధం!

ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్‌లో హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చార్‌ధామ్ యాత్ర కొనసాగుతున్న వేళ ఆర్యన్ ఏవియేషన్ కార్యకలాపాలపై తాత్కాలిక నిషేధం విధించింది. ఆదివారం ఆర్యన్ ఏవియేషన్‌కు చెందిన హెలికాప్టర్ గుప్తకాశీ నుంచి కేదార్‌నాథ్‌కు బయలుదేరింది. అదే సమయంలో ప్రమాదం జరిగింది.


గౌరీకుండ్‌లో హెలికాప్టర్ కుప్పకూలింది.

ప్రమాద సమయంలో అందులో చిన్నారి సహా ఏడుగురు ప్రయాణికులున్నారు. అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. చార్ ధామ్ కొనసాగుతుండడంతో అప్రమత్తమైన ప్రభుత్వం ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అంతకుముందు.. యాత్రకు వచ్చే భక్తుల భద్రత దృష్ట్యా జూన్ 15, 16 తేదీల్లో ఈ ప్రాంతంలో చార్టర్, షటిల్ హెలికాప్టర్ కార్యకలాపాలను నిషేధించింది. తాజాగా ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో మరోసారి అప్రమత్తమైంది. అయితే.. ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోంది. కేదార్‌నాథ్ లోయలో సమీపంలో హెలికాప్టర్ కార్యకలాపాలను, కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ పనితీరును సమీక్షించడానికి నైపుణ్యం కలిగిన అధికారులను వెంటనే నియమించాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ DGCAని ఆదేశించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## ఆసుపత్రిలో చేరిన సోనియా గాంధీ



కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆదివారం ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఇక్కడి గ్యాస్ట్రో విభాగంలో చేరినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆమె వైద్యుల పరిశీలనలో ఉన్నట్లు తెలిపాయి. ఈ నెల 9న సోనియా ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దీనికి రెండు రోజుల ముందు శిమ్లాలోని ఇందిరాగాంధీ వైద్య కళాశాల ఆసుపత్రి (ఐజీఎంసీ)లో చేరిన విషయం తెలిసిందే. అధిక రక్తపోటుతో బాధపడుతున్న ఆమెకు వైద్యులు చికిత్స అందించారు.

## ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం




ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం రన్‌వేపైనే ఉండాల్సి వచ్చింది. ఈ కారణంగా ప్రయాణం 7 గంటల సేపు ఆలస్యం కానుంది. ఈ ఘటనపై సదరు సంస్థ స్పందించింది. వివరాల్లోకి వెళితే.. ఎయిరిండియా విమానం ఐఎక్స్ 1511 ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ విమానాశ్రయం నుంచి పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాకు బయలు దేరాల్సి ఉంది. టేకాఫ్‌కు కాసేపటికి ముందు విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని వెంటనే గుర్తించిన సంస్థ అప్రమత్తమైంది. దీంతో విమాన ప్రయాణాన్ని నిలిపివేసింది. 7 గంటలు ఆలస్యంగా బయలుదేరనుందని తెలిపింది. ఈ ఘటనపై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఒకరు స్పందించారు. ''టేకాఫ్‌కి కాసేపు ముందే సాంకేతిక లోపాన్ని గుర్తించాం. ఆలస్యం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. వారికి రీషెడ్యూల్ లేదా రీఫండ్ చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉంది'' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా ఫ్లైట్ నెంబర్ ఏఐ 171 విమానం ఇటీవల కూలిపోయిన సంగతి తెలిసిందే. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 274 మంది మృతి చెందారు. అయితే.. ఈ ప్రమాదంపై స్వయంగా దర్యాప్తు చేపట్టేందుకు ఎయిరిండియా సిద్ధమైంది. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర తనిఖీలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మరో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని గుర్తించారు.





## ఎయిరిండియా ప్రమాద ఘటన.. విజయ్ రూపాణీ మృతదేహం గుర్తింపు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 12న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం, భాజపా సీనియర్ నేత విజయ్ రూపాణీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన మూడు రోజుల అనంతరం ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘ్వీ వెల్లడించారు. రూపాణీ కుటుంబ సభ్యుల నమూనాలతో మృతదేహం డీఎన్‌ఏ సరిపోలిందన్నారు. దీంతో భౌతికకాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. ఇప్పటిదాకా 32 మంది మృతుల డీఎన్‌ఏ వారి కుటుంబసభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు బీజే వైద్య కళాశాల సీనియర్ ప్రభుత్వ వైద్యుడు తెలిపారు. డీఎన్‌ఏ పరీక్ష నిర్వహించి.. ఇప్పటి వరకు 14 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబసభ్యులకు ఇచ్చారు. ప్రమాద తీవ్రత వల్ల చాలా వరకు గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో డీఎన్‌ఏ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో పరీక్షకు ఎక్కువ సమయం పడుతుండడం గుర్తింపు ఆలస్యం అవుతోందని తెలిపారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన 11 మంది విదేశీయుల కుటుంబాలను ఇప్పటికే సంప్రదించామన్నారు.

## ఎఫ్-35 ఫైటర్ జెట్ కేరళలో అత్యవసర ల్యాండింగ్..!



బ్రిటన్‌కు చెందిన ఎఫ్35బీ రకం యుద్ధ విమానం కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేసింది. హిందూ మహాసముద్రం పై ప్రయాణిస్తున్న సమయంలో అందులో ఇంధనం తగ్గిపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. ఐదో తరానికి చెందిన ఈ స్టెల్త్ ఫైటర్ జెట్.. యూకేకు చెందిన 'హెచ్ఎమ్ఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్' క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌లో భాగం. ఇది ప్రస్తుతం ఇండో పసిఫిక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తోంది. ఇటీవల భారత నావికాదళంతో కలిసి యుద్ధ విన్యాసాలు కూడా చేసింది. ఎఫ్ 35బీ జెట్ ఈ ప్రాంతంలో ల్యాండింగ్ కావడం అరుదైన ఘటనేగానీ అసాధారణం కాదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాకపోతే హెచ్ఎమ్ఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌పై ఇది ల్యాండింగ్ ఎందుకు చేయలేకపోయిందనే తెలియ రాలేదు. కానీ, ఆ నౌక చుట్టుపక్కల వాతావరణం అనుకూలించకపోవడమే దీనికి కారణమై ఉండొచ్చు. ఎఫ్35బీ వేరియంట్.. షార్ట్ టేకాఫ్ లేదా వర్టికల్ ల్యాండింగ్ కోసం రూపొందించారు. విమాన వాహక నౌకల పై పని చేసేందుకు వీలుగా ఉంటుంది. దీని స్టెల్త్ సామర్థ్యం, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సిస్టమ్స్, డేటా షేరింగ్ మౌలిక సదుపాయాల కారణంగానే ఇది అమెరికా, యూకే, ఇజ్రాయెల్, నాటో వైమానిక దళాల్లో అత్యంత కీలకమైందిగా మారింది. అయితే.. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై ఇప్పటి వరకు యూకే రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి అధికార ప్రకటన వెలువడలేదు.

## ప్రాణాలు ఎలాగూ మిగల్లేదు.. కనీసం మృతదేహాలైనా ఇవ్వండి!

* **విమాన ప్రమాదఘటన బాధితకుటుంబాల ఆవేదన**



అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద ఘటనలో సజీవ దహనమైన వారి మృతదేహాలను గుర్తించడం కష్టతరం అవుతోంది. శరీరాలు ఛిద్రమైపోవడంతో అవి ఎవరివో తేల్చడం కత్తిమీద సాములా మారింది. ప్రతి శరీరభాగానికి డీఎన్‌ఏ టెస్టులు చేయాల్సి రావడంతో ఎక్కువ సమయం తీసుకుంటోంది. మరోవైపు మాంసపు ముద్దలు ఇచ్చి.. 'ఇవి మీ వారివే' అని వైద్యులు చెబుతుంటే.. బంధువులు అంగీకరించలేకపోతున్నారు. ఒకట్రెండు ముక్కలు కాకుండా పూర్తి మృతదేహాలను అప్పగిస్తే అంత్యక్రియలైనా గౌరవంగా నిర్వహించుకుంటామంటూ వారు పడుతున్న ఆవేదన గుండెల్ని మెలిపెడుతోంది. డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహిస్తున్న అహ్మదాబాద్‌లోని సివిల్ ఆస్పత్రిలోని శవాగారం వద్ద.. మృతదేహాన్ని తీసుకొచ్చే సంచిలో రెండు తలలు ఉండటం వివాదానికి తావిచ్చింది. అప్రమత్తమైన వైద్యాధికారులు వెంటనే మరోసారి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తన కుటుంబ సభ్యుల అవశేషాలన్నీ అప్పగించమని ఓ వ్యక్తి అధికారులను వేడుకున్నారు. అయితే, అది సాధ్యం కాదని అతి కష్టం మీద ఆయనను అధికారులు ఒప్పించారు. కష్టమని తెలిసినా.. ఆత్మీయులను కోల్పోయిన బాధలో బాధిత కుటుంబీకులు వైద్యులను ప్రాధేయపడుతున్న తీరు కన్నీరు తెప్పిస్తోంది. ఓ వైపు కుటుంబీకులను కోల్పోయామన్న బాధ, మరోవైపు కనీసం వారి మృతదేహాలను కూడా ఇంటికి తీసుకెళ్లలేకపోతున్నామన్న ఆవేదనతో ఆస్పత్రి ఆవరణలో పరిస్థితి హృదయవిదారకంగా మారింది. విమాన ప్రమాదంలో మృతి చెందినవారి మృతదేహాలను అహ్మదాబాద్‌లోని 1200 పడకల సివిల్ ఆస్పత్రిలో భద్రపరిచారు. రక్తసంబంధీకుల నుంచి డీఎన్‌ఏ నమూనాలను సేకరించి, మృతదేహాల నమూనాలతో సరిపోల్చి.. బంధువులకు అప్పగిస్తున్నారు. ఇప్పటి వరకు 14 మంది మృతుల డీఎన్‌ఏను వారి కుటుంబ సభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు అధికారులు వెల్లడించారు. డీఎన్‌ఏ పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. వీలైనంత వరకు మిగతా మృతుల డీఎన్‌ఏను గుర్తించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

## అందుకే.. ఆ వంతెన కూలిపోయింది



పుణె: మహారాష్ట్రలోని ఇంద్రాయణి నదిపై వంతెన కూలిపోయిన ఘటనపై రాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. వంతెన కూలిపోవడానికి గల కారణాలు తెలిపారు. ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఇనుప వంతెన తుప్పు పట్టడం వల్లే కూలిపోయిందని అన్నారు. ''పుణె జిల్లాలోని ఇంద్రాయణి నది ఉన్న ఆ వంతెనను ఏళ్ల కిందట ఇనుముతో నిర్మించారు. మాకు అందిన సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో కురిసిన వర్షం కారణంగా అది బాగా తుప్పు పట్టింది. అది కూలిపోయే సమయంలో అధిక సంఖ్యలో జనం దానిపై ఉండడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నదిపై కొత్త వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది'' అని అజిత్ పవార్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ప్రమాదంపై విచారణ వ్యక్తం చేశారు. గల్లంతైన వారి ఆచూకీ గుర్తించేందుకు సంబంధిత సహాయక బృందం చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు. కాగా.. ఇంద్రాయణి నదిపై కుందమాల పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు అధిక సంఖ్యలో వచ్చారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

# నెలాఖరులో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ పెళ్లి..

## వ్యతిరేకిస్తున్న వెనిస్ నగర పౌరులు..!



**న్యూఢిల్లీ:** ప్రపంచ కుబేరుల్లో ఒకరు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారు. మాజీ టీవీ జర్నలిస్ట్ లారెన్ సాంచెజ్‌ను పెళ్లి చేసుకోనున్న విషయం తెలిసిందే. జూన్ చివరి వారంలో పెళ్లికి ముహూర్తం ఫిక్స్ చేసినట్లు సమాచారం. జూన్ నుంచి 24 నుంచి 26 వరకు వెనిస్‌లో వివాహం జరుగున్నట్లు తెలుస్తున్నది. వివాహం తేదీ, వేదికను గోప్యంగా ఉంచినా.. ఇటలీలోని వెనిస్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. దాంతో జెఫ్ బెజోస్ పెళ్లి ఏర్పాట్లేనని తేలింది.

కానీ, వెనిస్‌లోని స్థానికులు పెళ్లికి భారీ ఏర్పాట్లు చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హై ప్రొఫైల్ వివాహం ఇప్పటికే రద్దీగా, పర్యాటకులు ఇబ్బంది పడుతున్న నగరంలో మరింత రద్దీ పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఈ సందర్భంలో స్థానికులు నో స్పేస్ ఫర్ జెబోస్ పేరుతూ నిరసనలు ప్రారంభించారు. శాన్ జార్జియో ద్వీపంలోని చర్చి స్టీపుల్‌పై నో స్పేస్ ఫర్ జెజోస్ అనే బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. లా మిసెరికార్డియా అనే ఈవెంట్ హాల్‌లో వివాహం జరగవచ్చని నిరసన నిర్వాహకురాలు ఫెడెరికా టోనినెల్లో పేర్కొన్నారు.

జెబోస్ అక్కడికి చేరుకోలేరంటూ ఆమె హెచ్చరించారు. తాము తమ శవాలతో రోడ్లను.. పడవలు, లైఫ్‌సేవర్స్‌తో కాలువలను దిగ్బంధిస్తామన్నారు. మరో నిరసనకారుడు నా హాబీ స్టెల్లా ఫే మాట్లాడుతూ.. 10 మిలియన్ డాలర్ల వివాహాన్ని ఆపేందుకు అవకాశం ఉందని.. దాన్ని అడ్డుకోవాల్సిందేనన్నారు. అయితే, వెనిస్‌కు చెందిన ప్రతిపక్ష నేత గియోవన్నీ ఆండ్రియా మార్టిని మాట్లాడుతూ.. ఈ వివాహం వెనిస్ 'డిస్నీఫికేషన్'కు ఉదాహరణ.. ఇది సాధారణ వెనీషియన్లకు ప్రయోజనం చేకూర్చదన్నారు. అసౌకర్యం కలుగుతుందన్నారు. తీవ్రమవుతున్న నిరసనల మధ్య, వెనిస్ మేయర్ లుయిగి బ్రుగ్నారో బెజోస్‌కు మద్దతుగా నిలిచారు.

నిరసనలు సిగ్గుచేటుగా అభివర్ణించారు. ఈ వివాహం నగరానికి ఎలాంటి హాని ఉండదన్నారు. 200 మంది అతిథులను మాత్రమే ఆహ్వానిస్తారని, కాబట్టి నగర వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆయన అన్నారు. జెఫ్ బెజోస్ 1993లో మెకెంజీ స్కాట్‌ను వివాహం చేసుకున్నారు. దాదాపు 25 సంవత్సరాల వైవాహిక జీవితానికి ముగింపు పలికారు. 2019లో విడాకులు తీసుకొని విడిపోయారు. బెజోస్, మెకెంజీకి నలుగురు పిల్లలు ఉన్నారు. బెజోస్ లారెన్ సాంచెజ్‌ను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. వెనిస్‌లో జరగనున్న ఈ గ్రాండ్ వివాహానికి భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యూజర్లకు గుడ్‌న్యూస్..

## తగ్గనున్న టైమింగ్..




**న్యూఢిల్లీ:** డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన యూపీఐ, భారతదేశంలో దైనందిన జీవితంలో ఒక భాగంగా మారింది. నగదు రహిత లావాదేవీలను సులభతరం చేస్తూ, కోట్లాది మంది ప్రజల ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసింది. ఇప్పుడు యూపీఐ వినియోగదారులకు మరో శుభవార్త. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తీసుకున్న తాజా నిర్ణయంతో, జూన్ 16 నుంచి యూపీఐ లావాదేవీలు మరింత వేగంగా, సమర్థవంతంగా జరగనున్నాయి. ఈ మార్పులు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి ప్రముఖ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు జరిపే వారికి ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తాయి. దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి నాంది పలికిన యూపీఐ లావాదేవీలు ఇకపై మరింత వేగంగా జరగనున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) తీసుకున్న కీలక నిర్ణయంతో జూన్ 16 నుంచి ఈ మార్పులు అమలులోకి వస్తాయి. వినియోగదారులకు మెరుగైన అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఎన్‌పీసీఐ ఈ చర్యలు చేపట్టింది. యూపీఐ సేవలకు సంబంధించిన వివిధ ఏపీఐల ప్రతిస్పందన సమయాన్ని ఎన్‌పీసీఐ తగ్గించింది. నగదు రహిత లావాదేవీలతో భారతీయుల దైనందిన జీవితాన్ని యూపీఐ సులభతరం చేసింది. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎన్‌పీసీఐ నిరంతరం కొత్త నిబంధనలు జారీ చేస్తూ ఉంటుంది. తాజా ఆదేశాల మేరకు జూన్ 16 కల్లా తమ వ్యవస్థలలో అవసరమైన మార్పులు చేసుకోవాలని ఎన్‌పీసీఐ తన సభ్యులను ఆదేశించింది. ఎన్‌పీసీఐ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, తరచుగా ఉపయోగించే యూపీఐ ఏపీఐలు లావాదేవీ స్థితిని తనిఖీ చేయటం, లావాదేవీ రద్దు (ట్రాన్సాక్షన్ రివర్సల్)-వంటి వాటికి గతంలో ఉన్న 30 సెకన్ల ప్రతిస్పందన సమయాన్ని 10 సెకన్లకు తగ్గించారు. అడ్రస్ ధ్రువీకరణ (పే, కలెక్ట్) యూపీఐ ఏపీఐకి సంబంధించిన ప్రతిస్పందన సమయాన్ని కూడా 15 సెకన్ల నుంచి 10 సెకన్లకు కుదించారు.

# మార్కెట్‌ను షేక్ చేయనున్న ఎలక్ట్రిక్ స్కూటర్లు.. త్వరలో భారతదేశంలో లాంచ్!



**న్యూఢిల్లీ:** కొత్త ఎలక్ట్రిక్ స్టార్టప్‌లు మాత్రమే కాదు.. పెద్ద ఆటో కంపెనీలు కూడా కొత్త మోడళ్లతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో సందడి చేస్తున్నాయి. ఒకటి లేదా రెండు కాదు, నాలుగు కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్లు త్వరలో భారత మార్కెట్లోకి ప్రవేశించబోతున్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల హవా కొనసాగుతున్న నేపథ్యంలో కంపెనీలు సరికొత్త మోడళ్లతో ఈవీలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి.

హోండా తన మొదటి ఎలక్ట్రిక్ స్కూటర్‌ను లాంచ్ చేసినప్పుడు సుజుకి ఎలా వెనుకబడి ఉంటుంది. అందుకే సుజుకి కూడా ఒక అడుగు ముందుకేసింది. సుజుకి ఈ నెలలో తన మొదటి ఎలక్ట్రిక్ స్కూటర్‌ను 3.07% బ్యాటరీతో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో 4.1% ఎలక్ట్రిక్ మోటారు ఉంటుంది. ఈ మోడల్ ఖచ్చితమైన లాంచ్ తేదీ ఇంకా వెల్లడి కాలేదు. కానీ పరిధికి సంబంధించి ఈ స్కూటర్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 95 కి.మీ వరకు మైలేజీ ఇస్తుందని చెబుతున్నారు. ఇది కాకుండా ఈ స్కూటర్ గరిష్ట వేగం గంటకు 71 కి.మీ.

హీరో మోటోకార్ప్ ఈ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ వచ్చే నెల జూలై 1న లాంచ్ కానుంది. ఈ స్కూటర్‌ను చిన్న డిస్‌ప్లే, 12 అంగుళాల చక్రాలతో లాంచ్ చేయవచ్చు. ఈ స్కూటర్ 2 మోడల్ మాదిరిగానే బ్యాటరీ ఎంపికను కలిగి ఉంటుందని భావిస్తున్నారు. కానీ ప్రస్తుతం కంపెనీ దీనిని ఎలాంటి వివరాలు ధృవీకరించలేదు.



# ఆస్ట్రేలియా డబుల్ స్ట్రోక్..

## టీమిండియాకు ఆరో ఓటమి..!



**యూరప్:** యూరప్ గడ్డపై జరుగుతున్న హాకీ ప్రో లీగ్‌లో భారత జట్టు ఆరో ఓటమి ఎదురైంది. ఇప్పటికే నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో పరాజయంతో కుమిలిపోతున్న టీమిండియా.. ఆస్ట్రేలియా చేతిలో వరుసగా రెండో ఓటమిని చవి చూసింది. గత పోరులో ఆఖర్లో గోల్స్ సమర్పించుకున్న భారత్.. ఈసారి ప్రత్యర్థిని నిలువరించలేక మళ్లీ విజయం వాకిట బొక్కబోర్లాపడింది. శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో హర్‌ప్రీత్ సింగ్ సేన 2-3తో వెనకబడింది.

గత మ్యాచ్‌లో మాదిరిగానే భారత ఆటగాళ్లు తొలి అర్ధ భాగంలోనే గోల్ సాధించారు. డిఫెండర్ సంజయ్ రానా 3వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ ద్వారా తొలి గోల్ అందించాడు. కానీ, ఆ తర్వాత ఆసీస్ ఆటగాళ్లు టిమ్ బ్రాండ్ (4వ నిమిషం), బ్లేక్ గోవర్స్ 5 వ నిమిషంలో గోల్స్ చేయగా భారత్ వెనకబడింది. అయితే.. దిల్‌ప్రీత్ సింగ్ 36వ నిమిషంలో గోల్ చేయగా టీమిండియా 2-2తో స్కోర్ సమం చేసింది. దాంతో 'హమ్మయ్య మ్యాచ్‌ను కాపాడుకుంటాం' అని హర్మన్‌ప్రీత్ సేన ధీమాగా ఉన్న వేళ.. భారత డిఫెండర్లను ఏమారుస్తూ కూపర్ బర్న్స్(36 నిమిషం) గోల్‌తో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

27వ నిమిషంలో టీమిండియాకు రెండు పెనాల్టీ కార్నర్లు లభించాయి. కానీ.. వాటిని హర్మన్‌ప్రీత్ బృందం సద్వినియోగం చేసుకోలేకపోయింది. 400వ మ్యాచ్ ఆడుతున్న మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తీవ్రంగా నిరాశపరిచాడు. మరో 10 నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా ఆసీస్ ఆటగాళ్లు రెండు పెనాల్టీ కార్నర్లు సాధించారు. అయితే.. గోల్ కీపర్ పాఠక్ వాటిని సమర్థంగా అడ్డుకోవడంతో ఒక్క పాయింట్ తేడాతో భారత జట్టు పరాజయం పాలైంది.వరుసగా ఆరు ఓటములతో డీలాపడిన టీమిండి తదుపరి మ్యాచ్‌లో జూన్ 21న బెల్జియంతో తలపడనుంది.

# కెప్టెన్‌గా చిరస్మరణీయ విజయాలు అందించా..

## కానీ, నా జుట్టును కోల్పోయా..!



**శ్రీలంక:** శ్రీలంక మాజీ కెప్టెన్ ఎంజెలో మాథ్యూస్ త్వరలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్న విషయం తెలిసిందే. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగబోయే తొలి టెస్టు అతడికి చివరి మ్యాచ్ కానుంది. రిటైర్మెంట్ వార్తను ఇప్పటికే ప్రకటించిన మాథ్యూస్ .. తన కెరియర్‌లోని పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. కెప్టెన్సీ సమయంలోనే తన జుట్టు ఎక్కువగా ఊడిపోయిందని చెప్పాడీ ఆల్‌రౌండర్.

'కెప్టెన్సీ చేపట్టిన తర్వాత నా జుట్టు చాలా పోయింది. నేను ఒక్కడినే కాదు లంకకు సారథ్యం వహించిన పలువురు ఆటగాళ్లకు కూడా పెద్దగా జుట్టు లేదు. ఎందుకంటే.. దేశానికి ప్రాతినిధ్యం వహించడం వేరు. జట్టును నడిపించడం వేరు. ప్రతిసారి అదనపు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిఒక్కరు మనల్నే గమనిస్తారు. టీమ్ గెలిచినా, ఓడినా మనం ఏం చెబుతామో వినాలని కోట్లాది మంది ఎదురుచూస్తారు. అందుకు.. అప్పుడప్పుడు ఒత్తిడిగా అనిపిస్తుంది. అయినా.. నేను ఆ సవాళ్లతో కూడిన ప్రయాణాన్ని ఎంతగానో ఆస్వాదించాను. నాకు అవకాశం లభించింది. జట్టును మరొక స్థాయికి తీసుకువెళ్లాలి' అనే లక్ష్యంతో పని చేశాను అని మాథ్యూస్ వెల్లడించాడు.

బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా లంక జట్టులోకి వచ్చిన మాథ్యూస్ 2013లో టెస్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 25 ఏళ్లకు పగ్గాలు అందుకున్న అతడు పిన్నవయస్కుడైన సారథిగా రికార్డు నెలకొల్పాడు. మాథ్యూస్ నేతృత్వంలోని లంక విదేశీ పర్యటనల్లో అద్భుతంగా రాణించింది. 2014లో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ విజేతగా నిలిచింది. అనంతరం వన్డే, టీ20 సారథిగానూ సేవలందించాడు మాథ్యూస్. అయితే.. 2017 జింబాబ్వే చేతిలో వన్డే సిరీస్ ఓటమితో అతడు మూడు ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా వైదొలిగాడు.

జూన్ 17న గాలేలో జరుగబోయే మ్యాచ్ ఈ లెజెండరీ ఆల్‌రౌండర్‌కు 119వది. ఇందులో 34 టెస్టులకు అతడు సారథిగా వ్యవహరించాడు. ప్రస్తుతం శ్రీలంక తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగుల వీరుల జాబితాలో మాథ్యూస్ మూడో స్థానంలో ఉన్నాడు. మాజీ ఆటగాళ్లు కుమార సంగక్కర, మహేళ జయవర్ధనేలు అతడికంటే ముందున్నారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో మాథ్యూస్ ఖాతాలో 8,167 రన్స్ ఉన్నాయి. 16 సెంచరీలు బాదిన అతడి అత్యధిక స్కోర్.. 200 నాటౌట్. బంతితోనూ చెలరేగుతూ 33 వికెట్లు పడగొట్టాడీ వెటరన్ ప్లేయర్.

# డబ్ల్యూటీసీలో కమిన్స్, బుమ్రా హవా..





## అత్యధిక వికెట్ల వీరులు వీళ్లే..!

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. 27 ఏళ్ల కలకు రూపమిస్తూ దక్షిణాఫ్రికా తొలిసారి ఐసీసీ టోర్నీ విజేతగా ఆవిర్భవించింది. లార్డ్స్‌లో తెంబ బవుమా సారథ్యంలోని సఫారీ జట్ట కొత్త చరిత్ర సృష్టిస్తూ టెస్టు గదను అందుకుంది. దాంతో, వరుసగా రెండోసారి విజేతగా నిలవాలనుకున్న కంగారూలకు నిరాశే మిగిలింది. అయితే.. రెండేళ్లుగా ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ సీజన్‌లో పేసర్ల హవా కొనసాగింది. వీళ్లలో ఆసీస్ స్పీడ్‌స్టర్లు ఇద్దరూ అత్యధిక వికెట్ల వీరుల జాబితాలో చోటు దక్కించుకున్నారు.

డబ్ల్యూటీసీ 2023-25 సైకిల్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అత్యధిక వికెట్లు పడగొట్టాడు. లార్డ్స్‌లో సఫారీలతో జరిగిన ఫైనల్లో నిప్పులు చెరిగిన ప్యాటీ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు.. రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ సాధించాడు. దాంతో, ఈ సైకిల్‌లో అతడి పేరిట 80 వికెట్లు ఉన్నాయి. ఆసీస్ సారథి 18 మ్యాచుల్లోనే 80 వికెట్లు పడగొట్టగాడు. భారత జట్టు ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ యార్కర్ కింగ్ 15 మ్యాచుల్లోనే 77 వికెట్లు తీశాడు.

### అశ్విన్ ఐదో స్థానంలో..

డబ్ల్యూటీసీ ఫైనల్లో అర్ధ శతకంతో ఆసీస్ ఆధిక్యాన్ని 280కి పెంచిన మిచెల్ స్టార్క్ కూడా 70కి పైగా వికెట్లు తీశాడు. యార్కర్లతో బ్యాటర్లను హడలెత్తించే అతడి ఖాతాలో కూడా 77 వికెట్లు ఉన్నాయి. అయితే.. బుమ్రా కంటే 5 మ్యాచులు.. అంటే ఈ స్పీడ్‌స్టర్ 19 మ్యాచులు తీసుకున్నాడు. కంగారూ స్పిన్నర్ నాథన్ లియాన్ 7 టెస్టుల్లో 66 వికెట్లతో నాలుగో స్థానంలో నిలవగా మాజీ స్పిన్నర్ అశ్విన్ ఐదో స్థానంలో ఉన్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మధ్యలోనే టెస్టులకు వీడ్కోలు పలికిన యశ్.. 14 టెస్టుల్లో 63 వికెట్లు పడగొట్టాడు.

# సర్ఫరాజ్ ఖాన్ మెరుపు సెంచరీ..

## తేలిపోయిన బుమ్రా..!



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనకు ముందు సన్నాహక పోరులో భారత ప్రధాన పేసర్ బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అయితే.. టాపార్డర్ బ్యాటర్లు మాత్రం దంచేశారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ అర్ధ శతకాలతో ఫామ్ చాటుకున్నారు. ఇండియా ఏ కు ఆడుతున్న సర్ఫరాజ్ ఖాన్ విధ్వంసక శతకంతో మెరిశాడు.

ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయలేదన్న కసితో కాబోలు మెరుపు సెంచరీ బాదాడు. 76 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో సెంచరీ పూర్తి చేసుకున్నాడీ చిచ్చరపిడుగు. దాంతో ఇండియా ఏ రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. అయితే.. ప్రధాన జట్టు కంటే 160 పరుగుల వెనకబడే ఉంది.

### పటాపంచలు చేస్తూ..

బెకెన్‌హమ్‌లోని కౌంటీ క్రికెట్ మైదానంలో భారత జట్లు ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతున్నాయి. ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్టులు ఆడిన భారత ఏ జట్టుతో శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని సీనియర్ జట్టు తలపడిన ఈ పోరులో.. సర్ఫరాజ్ ఖాన్ సెంచరీతో తన తడాఖా చూపించాడు. 101 పరుగులతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై ఆడలేదు అనే సందేహాన్ని పటాపంచలు చేసిన సర్ఫరాజ్ సెలెక్టర్లకు సవాల్ విసిరాడు. నిరుడు స్వదేశంలో ఇంగ్లండ్ మీదే అరంగేట్రం చేసిన ఈ రంజీ హీరో.. బెంగళూరులో న్యూజిలాండ్‌పై 150 పరుగులతో చెలరేగిన విషయం తెలిసిందే.

ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లో ప్రధాన పేసర్లు బుమ్రాకు మాత్రం ఒక్క వికెట్ దక్కలేదు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలు తలా రెండు వికెట్లు తీసినా.. భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అభిమాన్యు ఈశ్వరన్(39)ను నితీశ్ కుమార్ పెవిలియన్‌కు పంపాడు.

# ఇంటిమేట్ సీన్స్ చేయడం కష్టంగా అనిపిస్తుంది..

**అనంతిక సనీల్ కుమార్**




టాకీస్: మ్యాడ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన కేరళ ముద్దుగుమ్మ అనంతిక సనీల్ కుమార్. మొదటి సినిమాతోనే ఊహించని క్రేజ్ సొంతం చేసుకున్న ఈ వయ్యారి.. ఇప్పుడు 8 వసంతాలు అనే సినిమాతో అడియన్స్ ముందుకు రాబోతుంది. జూన్ 20న ఈ సినిమా విడుదలకాబోతుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ మూవీ ప్రమోషన్లలో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు పంచుకుంటుంది. అనంతిక మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఇంటిమేట్ సీన్స్ చేయలేదు. అలాంటి సన్నివేశాల్లో నటించడం చాలా కష్టంగా అనిపిస్తుంది. అలా అని అలాంటి పాత్రను చేయను అని చెప్పట్లేదు. కథ డిమాండ్ చేస్తే ఇంటిమేట్ సీన్స్ చేయడానికి నాకు ఇబ్బందిలేదు. అప్పుడు కొంత లిమిటేషన్ ఉంటుందని చెప్పుకొచ్చింది ఈ ముద్దుగుమ్మ.తనకు సినిమాల్లోకి రావాలనే ఆసక్తి లేదని.. చిన్నప్పటి నుంచే డ్యాన్స్, కరాటే నేర్చుకున్నానని తెలిపింది. సినిమాల్లోకి వచ్చేందుకు వీటిని నేర్చుకోలేదని.. కానీ అనుకోకుండానే సినిమాల్లోకి వచ్చినట్లు తెలిపింది. కోవిడ్ టైంలో ఖాళీగా ఉండడంతో ఓ మలయాళీ సినిమాలోకి డ్యాన్సర్ గా వెళ్లడంతో అక్కడ డీఓపీ తనను చూసి హీరోయిన్ గా ట్రై చేయాలని సూచించాడని తెలిపింది. అప్పటి నుంచి సినిమాలకు అడిషన్స్ ఇవ్వడం స్టార్ట్ చేశానని.. మంచి సందేసం ఇచ్చే సినిమాలను చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. తన పాత్రకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను మాత్రమే ఎంచుకుంటున్నానని.. నటిగా కొనసాగాలని తనకు లేదని.. ప్రస్తుతం లా చేస్తున్నానని.. 40 ఏళ్ల వయసు వచ్చాకా రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం 8 వసంతాలు సినిమాలో నటిస్తుంది అనంతిక. మరోవైపు సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తుంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన క్రేజీ ఫోటోస్ నెట్టింట తెగ వైరలవుతున్నాయి. అలాగే తెలుగులో ఈ అమ్మడు మరిన్ని అవకాశాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది.






## 'కుబేర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా జక్కన్న

**టాకీస్:** శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న కుబేర చిత్రం నేడు గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకోబోతున్న విషయం తెలిసిందే. తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా వైడ్‌గా ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నేడు హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకోబోతుంది. అయితే ఈ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి రాబోతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం తాజాగా ప్రకటించింది. పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు.

## 'కాంతార' షూటింగ్‌లో నటుడు రిషబ్ షెట్టికి ప్రమాదం



**టాకీస్:** కన్నడ నటుడు రిషబ్ షెట్టి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ కాంతార చాప్టర్1కి వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. గతేడాది ఈ సినిమాలో నటిస్తున్న జూనియర్ ఆర్టిస్టులు ప్రయాణిస్తున్న వ్యాన్‌కు ప్రమాదం చోటు చేసుకోగా.. ఆ తర్వాత కొన్నిరోజులకే కపిల్ అనే నటుడు నదిలో కొట్టుకుపోయి చనిపోయాడు. మరోవైపు అదే నెలలో రాకేశ్ పూజారి అనే మరో నటుడు గుండెపోటుతో కన్నుమూయగా.. నిన్న శనివారం రోజున కాంతారలో నటిస్తున్న మిమిక్రీ ఆర్టిస్ట్ కళాభవన్ నిజూ (43) సైతం గుండెపోటుతో మృతి చెందాడు. అయితే ఈ సంఘటనలు మరవకముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో నటుడు రిషభ్ షెట్టి కూడా ఉండడం విశేషం.

ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కర్ణాటకలోని మాణి జలాశయం వద్ద జరుగుతుండగా.. ఈ షూటింగ్‌లో పాల్గొన్న నటుడు రిషభ్‌షెట్టితో పాటు 30 మంది ఆర్టిస్టులు కలిసి ప్రయాణిస్తున్న బోట్ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. దీంతో వెంటనే వారందరూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటనలో కెమెరాతో పాటు సాంకేతిక పరికారలు కొట్టుకుపోగా.. రిషభ్‌తో పాటు పలువురు నటులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

## ప్రభాస్ 'రాజాసాబ్' టీజర్ టైం ఫిక్స్..

**టాకీస్:** ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ 16న టీజర్ విడుదల చేయనున్నారు మేకర్స్. తాజాగా దీనికి సంబంధించి మరో అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమా టీజర్‌ను రేపు ఉదయం 10.52 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ప్రీ టీజర్ ప్రోమోను పంచుకుంది.



## 'మార్కో 2' లేనట్లే.. క్లారిటీ ఇచ్చిన ఉన్ని ముకుందన్

**టాకీస్:** మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రల్లో వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం మార్కో. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం కేరళాలో బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా సినిమాలో హింస ఎక్కువగా ఉ ఒడడం వలన విమర్శలను కూడా అందుకోంది. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు మలయాళం మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. మూవీపై ఉన్న బజ్ కారణంగా.. సీక్వెల్ ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే ఈ వార్తలపై తాజాగా క్లారిటీ ఇచ్చాడు ఉన్ని ముకుందన్. ఈ సినిమాకు వచ్చిన నెగిటివిటీ కారణంగా సీక్వెల్‌ను రద్దు చేస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించాడు.

ఒక అభిమాని 'మార్కో 2' గురించి అడగ్గా.. ఉన్ని ముకుందన్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ విషయంపై స్పందిస్తూ.. "క్షమించండి సోదరా, నేను మార్కో సిరీస్‌ను కొనసాగించే ఆలోచనలను విరమించుకున్నాను. ఈ సినిమాపై వచ్చిన నెగిటివిటే దానికి కారణం. మార్కో కంటే పెద్దది.. మర్కో కంటే పెద్ద ప్రాజెక్ట్‌ను తీసుకురావడానికి నావంతు కృషి చేస్తాను. అంటూ ఉన్ని చెప్పుకోచ్చాడు.







## ముంబై లోకల్ ట్రైన్‌లో నటి మాళవికాకు చేదు అనుభవం..

**స్పందించిన ముంబై పోలీసులు**

**టాకీస్:** తంగలాన్, మాస్టర్ వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది నటి మాళవిక మోహనన్. అయితే ఈ నటి తనకు ముంబై లోకల్ ట్రైన్‌లో ఎదురైన ఒక చేదు అనుభవం గురించి తాజాగా పంచుకోగా.. దీనిపై స్పందించారు ముంబై పోలీసులు. మాళవికా మోహనన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కాలేజ్ డేస్‌లో రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ముంబై లోకల్ ట్రైన్‌లో తన స్నేహితురాళ్లతో కలిసి ప్రయాణిస్తుండగా ఈ సంఘటన జరిగిందని వివరించారు. మేము కూర్చున్న ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ దాదాపు ఖాళీగా ఉందని, అప్పుడు ఒక వ్యక్తి కిటికీ గ్రిల్‌కు దగ్గరగా వచ్చి, ఏక్ చుమ్మా దేగి క్యా? (ఒక ముద్దు ఇస్తావా?) అని అసభ్యంగా అడిగాడని మళావిక తెలిపారు. ఆ సమయంలో తాము ముగ్గురం పూర్తిగా నిస్సహాయంగా ఉండిపోయామని, ఏం చేయాలో తెలియక భయంతో వణికిపోయామని ఆమె పేర్కొన్నారు. సుమారు 10 నిమిషాల తర్వాత తదుపరి స్టేషన్ రావడంతో ప్రయాణికులు కంపార్ట్‌మెంట్‌లోకి రావడంతో తాము ఊపిరి పీల్చుకున్నామని చెప్పారు. అయితే ఈ సంఘటనపై ముంబై పోలీసులు తమ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ద్వారా స్పందించారు. డియర్ మాళవిక గారు.. "మీరు మీ అనుభవాన్ని పంచుకోవడం, నగరంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేయడం మేము చూశాం. ఇలాంటి అనుభవాలు షాకింగ్‌గా ఉండటమే కాకుండా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపిస్తాయని మేము అర్థం చేసుకోగలం. కాబట్టి, పగలు లేదా రాత్రి ఏ సమయంలోనైనా, నగరంలో ఏ ప్రదేశంలో నైనా మీకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే, దయచేసి 112/100 నంబర్‌లకు కాల్ చేయండి. మేము వీలైనంత త్వరగా సహాయం అందిస్తాము. ఫిర్యాదు చేయకపోవడం వల్ల నేరస్థులు మరింత ధైర్యం పొందుతారు అని పోలీసులు తెలిపారు. ముంబై నగరం మహిళలకు ఎప్పుడూ సురక్షితమైనది, దానిని మరింత మెరుగుపరచడానికి మేము ఎటువంటి ప్రయత్నం వదిలిపెట్టము. ఒకసారి ఫిర్యాదు చేస్తే, నేరస్థుడిని చట్ట ప్రకారం తగిన విధంగా శిక్షిస్తామంటూ ముంబై పోలీసు విభాగం తెలిపింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.